andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.4 | కనిష్ఠం 21.2



నిర్మల్
జిల్లా వార్తలు

8

గురువారం 8 ఫిబ్రవరి 2024



కేంద్రమంత్రి రాజనాథ్ సింగ్‌ను సన్మానిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

కేంద్ర మంత్రులను కలిసిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 7 : నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆర్థికమంత్రికి తెలిపారు. రాజనాథ్ సింగ్, నిర్మలా సీతారామన్‌ను కలిసిన వారిలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయలశంకర్, రామారావుపటేల్, పాల్వాయి హరీష్ బుధవారం కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్గరేను కలుసుకున్నారు. నియోజకవర్గాల్లోని పలు సమస్యలు ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. మర్యాదపూర్వకంగా ఆయనను సన్మానించారు.

ఆరే మరాఠాతో సహా 28 కులాలను ఓబీసీలో చేర్చాలి

- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్‌కు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ విజ్ఞప్తి



హంసరాజ్ గంగారామ్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే

భైంసా, ఫిబ్రవరి 7 : ఆరె మరాఠాతో పాటు 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ జాతీయ బీసీ కమీషన్ చైర్మెన్ హంసరాజ్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో బీసీ కమిషనర్ కార్యాలయంలో చైర్మెన్ హంసరాజ్‌ను కలిసి సంబంధిత విషయంలో వినతిపత్రం అందచేశారు. అరే మరాఠా, గౌడజెట్ల, కుళ్లకడిగి, బుక్క అయ్యవార్లు తదితర 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని వినతిపత్రం అందచేశారు. సంబంధిత కులాల శ్రేణులను ఓబీసీలో చేర్చకపోవడం మూలంగా విద్యఉద్యోగ రంగాల్లో అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

నియోజక వర్గ పరిధికి సరహద్దులోనున్న మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలను అనుసంధానిస్తూ రహదారులు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారికి విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి సంబంధిత విషయంలో వినతిపత్రం అందచేశారు. ఇందులో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై నేడు సమావేశం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 7 : ఓటరు జాబితా సవరణలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

కబ్జాకోరల్లో గొలుసుకట్టు చెరువులు





- చెరువుల ఆక్రమణలతోనే ప్రతి ఏటా నిర్మల్‌కు ముప్పు
- కందకాలు, నాలాల ఆక్రమణలతో వరద నీరంతా రోడ్ల పైనే
- అడ్డగోలు వెంచర్లతోనూ సమస్య
- పట్టణాన్ని వెంటాడుతున్న ల్యాండ్ మాఫియా

నిర్మల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన చారిత్రక నిర్మల్ పట్టణం ప్రతి ఏటా వర్షాకాలంలో ముంపు బారిన పడుతోంది. కాకతీయుల కాలంలో ప్రణాళికబద్ధంగా నిర్మించిన గొలుసుకట్టు చెరువులు, కందకాల కబ్జాలతోనే ప్రతిసారి నిర్మల్ వరద నీటిలో మునిగి తేలుతోంది. అధికారులు వర్షాకాలం కన్నా ముందుగానే అప్రమత్తమై మిగిలి ఉన్న కందకాలు, నాళాలను శుభ్రం చేసి వర్షం నీరంతా రోడ్డు దాటకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వారు సకాలంలో స్పందించని కారణంగా సమస్య ప్రతి ఏటా జనాన్ని వెంటాడుతోంది. ఊరి బయట ఉన్న ఈ గొలుసుకట్టు చెరువులన్నీ పెరిగిన జనాభా, ఇళ్ల నిర్మాణాల కారణంగా జనావాసాల మధ్యలోకి చేరుకున్నాయి. దీంతో చెరువు భూములపై కబ్జాదారుల కళ్లుపడ్డాయి. జిల్లా కేంద్రమైన నాటి నుంచి నిర్మల్ ప్రాంతంలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రస్తుతం అందరి దృష్టి ఆ భూముల పైనే పడుతోంది. ముఖ్యంగా నిర్మల్ పట్టణంలో డీటీసీపీ అనుమతులు లేకుండా అనధికారిక వెంచర్లు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. ఇలా వెలుస్తున్న వెంచర్లలో చెరువు భూములే ఎక్కువగా ఉంటున్నాయన్న ఫిర్యాదులున్నాయి. చెరువు భూముల పక్కన ఉన్న పట్టా భూముల సర్వే నంబర్లతో ఈ చెరువు భూములను ఆక్రమించి రియల్టర్లు అక్రమ వెంచర్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రమైన నాటి నుంచి నిర్మల్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో ప్రభుత్వ భూములు, చెరువులకు సంబంధించిన శిఖం, బఫర్‌జోన్ భూములపై కబ్జాదారుల కన్ను పడింది. అధికార పార్టీ నేతల అండదండలు, అధికారుల సహకారంతో రికార్డులను సైతం తారు మారు చేసి పలువురు చెరువు భూముల ఆక్రమణకు పాల్పడ్డట్లు ఫిర్యాదులన్నాయి. గతంలో రాష్ట్ర హైకోర్టు సైతం ఇక్కడి చెరువు భూముల ఆక్రమణపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అయితే చెరువు భూముల ఆక్రమణ కారణంగా ప్రతీ ఏటా వర్షాకాలంలో అనేక కాలనీలు జలమయం అవుతున్నాయి. దీంతో పాటు నిర్మల్ పట్టణ నడిబొడ్డున ఉన్న భారీ కందకాలు కూడా ఎక్కడికక్కడ ఆక్రమణకు గురయ్యాయి. దీంతో ఈ కందకాల గుండా ప్రవహించాల్సిన నీరంతా సమీప కాలనీలోకి తన్నుకొస్తోంది. దీంతోపాటు నాళాలు సైతం ఆక్రమణకు గురవుతుండడంతో మురుగు నీటిప్రవాహం ముందుకు సాగడం లేదు. ఒక్కసారి గంటకు పైగా భారీ వర్షం కురిస్తే నిర్మల్ పట్టణంలోని అనేక వార్డులు జలమయం అవుతుండడం సాధారణంగా మారింది. గతంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్మల్‌లోని చారిత్రక గొలుసుకట్టు చెరువుల భూములను సర్వే ద్వారా నిర్ధారించారు. అయితే కంచరోని చెరువు, ధర్మసాగర్, మోతితలాబ్, మంజులాపూర్, పల్లె చెరువుల భూములను ఇప్పటికే పెద్దమొత్తంలో ఆక్రమించేశారు. ఆక్రమించిన భూములలో శాశ్వత నిర్మాణాలు కూడా చేపట్టినట్లు విమర్శలున్నాయి. మరికొన్ని చోట్ల కందకాలను సైతం కబ్జాదారులు మింగేశారు. నిర్మల్‌లోని డాక్టర్స్‌లేన్ నీట మునిగిపోతుండడానికి ప్రధాన కారణం కందకాల కబ్జానేనని చెప్పక తప్పదు. దీనికి సమీపంలోనే ఉన్న ధర్మసాగర్ చెరువు కూడా పెద్ద ఎత్తున ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే కంచరోని చెరువు, మంజులాపూర్ చెరువుల భూములు కూడా ఆక్రమణకు గురైనట్లు చెబుతున్నారు. ఇలాంటి ఆక్రమణ కారణంగానే జీఎన్ఆర్ కాలనీతో పాటు సిద్ధాపూర్, ఆదర్శనగర్, శాంతినగర్, ఇంద్రానగర్, శాస్త్రినగర్, వైఎస్ఆర్ కాలనీ, విశ్వనాథ్ పేట్, తదితర ప్రాంతాలన్నీ వరదనీటిలో చిక్కుకుంటున్నాయి. వర్షం వచ్చిందంటే ఈ కాలనీ వాసులంతా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



చెరువులో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

అటకెక్కిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ ప్రతిపాదన

కాగా నిర్మల్ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మిస్తామంటూ పాలకులు ఏళ్ల నుంచి చెబుతూనే ఉన్నారు. ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి కదలిక కనిపించడం లేదు. గతంలో కేంద్రప్రభుత్వం పట్టణ అభివృద్ధి శాఖకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపారు. 60 కోట్ల రూపాయలతో రూపొందించిన ఈ ప్రతిపాదనలకు ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ అటు కేంద్ర ప్రభుత్వాలు గానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు.

భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలో..

ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీల పరిధిలో కూడా ఇష్టారాజ్యంగా కబ్జాలపర్వం కొనసాగుతూ ఉండడంతో వరదనీరంతా అక్కడి రోడ్లను ముంచెత్తుతోంది. జనావాసాల్లో వరదనీరు జనాన్ని అతలాకుతలం చేస్తుంది. ఇళ్లలోకి పెద్దఎత్తున వరదనీరు చేరుకోవడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రతీఏటా ఇది సాధారణమైనప్పటికీ పాలకుల్లో మాత్రం కదలిక కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడి అధికార పార్టీ నేతల వెంచర్లు, ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ భూములలో ఇష్టారాజ్యంగా చేపడుతున్న నిర్మాణాలు ఈ పట్టణంలోని పలు వార్డుల ముంపుకు కారణం అవుతుందంటున్నారు. ముఖ్యంగా భైంసాలోని ఆటోనగర్, కుభీర్‌చౌరస్తా, వినాయకనగర్ తదితర వార్డులు అలాగే ఖానాపూర్‌లోని మెయిన్‌రోడ్‌తో పాటు మరిన్ని వార్డులను వరదనీరు ముంచెత్తుతోంది.

అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్



ఇటిక్యాల గ్రామంలో పర్యటిస్తున్న జాయింట్ కలెక్టర్

పెంబి, ఫిబ్రవరి 7 : మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పర్యటించి చేపట్టిన అభివృద్ధి పనులు, డంపింగ్ యార్డ్, స్మశానవాటిక, నర్సరీ, సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో పలురికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, మహేందర్, స్వామీ, ఏపీఎం గంగారెడ్డి, ఏపీఎం రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులున్నారు.

ఖానాపూర్‌ను

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : వెడ్మ బొజ్జు



ఖానాపూర్‌లో దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్, ఫిబ్రవరి 7 : ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండలంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని మస్కాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్, కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సత్యం, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు మాజీద్, పట్టణ అధ్యక్షులు రమేష్, కౌన్సిలర్ శ్రీనివాస్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు తిలక్‌రావు, తదితరులున్నారు.

అస్రా కాలనీ వాసుల ఇబ్బందులు తొలగించండి

- నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్



అస్రా కాలనీలో పర్యటిస్తున్న ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 7 : 17వ వార్డు అస్రా కాలనీకి చెందిన ప్రజలకు మురికి కాలువల వల్ల కలిగే ఇబ్బందులను తొలగించాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. రాకపోకలకు మురికినీరు ఇబ్బంది కలిగిస్తున్నాయని అక్కడి ప్రజలు చైర్మన్ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏఈ వినయ్, కౌన్సిలర్లు అన్వర్ పాషా, ముజాహిద్ చావుస్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 7 : మహిళా శిశు సంక్షేమ అధికారుల అలసత్వంపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులు ఇచ్చిన సమాధానాలపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పౌష్టికాహారం అందించడం, శామ్ మామ్, న్యూట్రిషన్ గార్డెన్, మిషన్ వాత్సల్యం, అంగన్‌వాడీ భవనాలు తదితర వాటి పురోభివృద్ధిపై ఆయన ప్రశ్నించారు. శామ్ మామ్ పిల్లలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించడాన్ని, వారి సమాధానంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు, మరమ్మతులపై నివేదికలు అందించాలని ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సంక్షేమ ఇన్‌చార్జి అధికారి నాగమణి, సీడీపీవో, తదితర సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 7 : రాబోయే వేసవికాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అన్నారు. మండలంలోని మాడేగాం మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్‌ను బుధవారం సందర్శించారు. వాటర్‌గ్రిడ్ పని తీరును పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పైప్‌లైన్‌ను పరిశీలించాలన్నారు. లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు.

పురోగతిపై సమీక్షలో అధికారుల తీరుపై అసహనం

ఈ సందర్భంగా వాటర్ గ్రిడ్‌లోని నీటి శుద్ధి ప్రక్రియను, పంపింగ్ సామర్థ్యం, స్టోరేజీ సామర్థ్యాన్ని ఈఈ సందీప్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం న్యూలోలం గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్, అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, మురికి కాలువలు, ఓవర్‌హెడ్ నీటిట్యాంకులను కలెక్టర్ పరిశీలించారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను వారానికి ఒక్కసారి శుభ్రం చేయాలన్నారు. ప్రతిరోజు రెండు సార్లు నీటిని నింపాలని సూచించారు. వారం రోజులపాటు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మురికి కాలువల్లో నీటి నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సరిత, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, మండల పంచాయతీ అధికారి అజీజ్‌ఖాన్, గ్రామ పంచాయతీ ఏపీవో దివ్యరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం సులోచనరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు కళావతి, ఆశా వర్కర్ లలిత, ఫీల్డ్ అసిస్టెంటు గోవిందుల మహేష్, చిన్నయ్య, మండల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నీటిశుద్ధి ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 7 : జిల్లాలో 45 రోజుల పదవ తరగతి పరీక్షల సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా బుధవారం పదవ తరగతికి నిర్వహిస్తున్న గణితం ప్రత్యేక పరీక్షల నిర్వహణను జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎ. రవీందర్‌రెడ్డి పలు పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. మొదటగా సోన్ మండలంలోని వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, పదవ తరగతి విద్యార్థులు పాఠశాలకు 100 శాతం హాజరుకావాలని, ఇవ్వబడిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సంసిద్ధం కావాలని సూచించారు. తరువాత లక్ష్మణచాంద మండలంలోని పీచర ఉన్నత పాఠశాల, మామడ మండలంలోని కొరిటికల్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతికి నిర్వహిస్తున్న ఇంగ్లీష్ పరీక్షను రాస్తున్న విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు చదువే పునాది అని, పదవ తరగతి అనేది వారి భవిష్యత్తులో ఇంకా కీలకమని గుర్తు చేశారు. కావునా పదవ తరగతి విద్యార్థులు చక్కగా ప్రణాళిక ప్రకారం కష్టపడి చదివి, మంచి మార్కులతో 100 శాతం ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే విషయాన్ని శ్రద్ధగా విని, కఠిన అంశాలను ఎక్కువగా అభ్యాసం చేసి, అభ్యాస దీపికలను చక్కగా సాధన చేసి మంచి ఫలితాలను సాధించాలన్నారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పరచి, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని, పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక ప్రణాళికను అమలు పరచాలని, లక్ష్య కార్య క్రమాలను చక్కగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్య మైన తాజా పోషకాహారాలను మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, సాయికృష్ణ, వెంకట రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎ.రవీందర్‌రెడ్డి

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి : డా.ధనరాజ్



మాట్లాడుతున్న ధనరాజ్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 7 : నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ సూచించారు. బుధవారం ఈ కార్యక్రమం అమలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 12వ తేదీన నిర్వహించే 1 నుంచి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్క పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను వేయాలన్నారు. మార్చి నెల 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కల మందు వేయాలన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ సర్వేలైన్స్ వైద్యాధికారి డాక్టర్ అతుల్ పల్స్ పోలియోపై శిక్షణ ఇచ్చారు. ఉప వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, నయనారెడ్డి, రవీందర్‌తో పాటు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డిగ్రీ కళాశాలలో అథ్లెటిక్స్ పోటీలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 7 : జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. 10, 12, 14 లోపు బాల బాలికలు రన్నింగ్, లాంగ్ జంప్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ భీమ్‌రావు, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శామ్యూల్, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ రమణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ముథోల్, ఫిబ్రవరి 7 : జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సబ్ జూనియర్ బాలబాలికల విభాగంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీ ఎంపిక జరుగనున్నట్లు కబ డ్డీ అసోసియేషన్ కార్యదర్శి సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కబడ్డీ పోటీలో ఎంపికైన వారు ఈ నెల 16 నుండి 19 తేదీలలో సూర్యపేట జిల్లాలోని మల్లారెడ్డి గూడెంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, బోనఫైడ్‌తో పాటు రూ. 100 ఎంట్రీ ఫీజుతో పీఈటీలు శ్రీధర్‌రెడ్డి, సునీల్‌లకు రిపోర్టు చేయాలని టీం నిర్వాహకులు ప్రవీణ్‌రెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రేమలత తెలిపారు.

అర్‌టీసీ బస్సు ఢీకొని

ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ లక్ష్మారెడ్డి

భైంసా, ఫిబ్రవరి 7 : భైంసా-నిర్మల్ జాతీయ రహదారి మార్గంలోని మాటేగాం గ్రామ వంతెన సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. భైంసా రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భైంసా నుంచి నిర్మల్ వైపు వెలుతున్న అర్‌టీసీ బస్సుకు వెనుక వైపు నుంచి వెలుతున్న ద్విచక్ర వాహనం ఓవర్ టేక్ చేసే సమయంలో అదుపు తప్పి ఢీకొట్టుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మాటేగాం గ్రామానికి చెందిన ద్విచక్ర వాహన చోదకుడు తురుకోళ్ల లక్ష్మారెడ్డి(52) తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో భైంసాలని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్య సేవల కోసం గాను ఇక్కడి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంబంధిత ఘటనపై భైంసా రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మున్నూరుకాపు

ఉద్యోగుల సంఘ సమావేశం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 7 : మున్నూరు కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం గురువారం సాయంత్రం 5 గంటలకు సోఫీనగర్ సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి బారె శ్రీనివాస్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. క్యాలెండర్ ఆవిష్కరణ ఉంటుందని సభ్యులు హాజరుకావాలన్నారు.

ఐక్య పోరాటాలకు

ఆశావర్కర్లు సిద్ధం కావాలి



నిర్మల్‌లో సమావేశంలో పాల్గొన్న ఆశా వర్కర్లు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 7 : ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సంఘం జిల్లా నాయకురాలు లావణ్య పిలుపునిచ్చారు. బుధవారం భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు ఆశాలు నిర్మల్ జిల్లాకేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, కంటి వెలుగు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఆశాలపై నిరంకుశ ధోరణి విడనాడాలన్నారు. పదేళ్ల కేంద్ర పాలనలో ఆశాలకు పనికి తగ్గవేతనం గూర్చి ఆలోచించలేకపోయిందన్నారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని, పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించడంతో పాటు పలు సమస్యలు నెరవేర్చాలని, ఈ నెల 16న జరిగే ఆశాల సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏడుగురు సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా లావణ్య, ఉపాధ్యక్షురాలిగా కే. లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎం. సుజాత, సహాయ కార్యదర్శిగా వసంత, కోశాధికారిగా సుధ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భాగ్యలక్ష్మి, రామలక్ష్మి, సంగీత, సరస్వతి, తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



నర్సాపూర్ (జి) గ్రామపంచాయతీలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 7 : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలల్లో రోడ్లు శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేశారు. మండల కేంద్రంలో గ్రామసభను నిర్వహించి తీర్మానాలు చేశారు. మండల కేంద్రంలో డ్రైనేజీలపై నిర్మించిన నిర్మాణాల తొలగింపు, ప్రమాదాలకు కారణ మవుతున్న శిలాఫలకాలను, డ్రైనేజీల్లో పూడికతీత, గ్రామంలో ఉన్న తెల్ల కల్లు దుకాణాలను గ్రామం చివర ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా యంపీవో శ్రీనివాస్‌గౌడ్ మాటాడుతూ ప్రత్యేకా.ధిరులు నూతన పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకుని పంచాయతీ విధులు సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతీ పంచా యతీని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యంపీడీవో వనజ, యంపీవో శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ సోమ శ్రీనివాస్, కార్యదర్శి వీణా, గ్రామస్తులు పాల్గొన్నారు.



నూతన కంపూటర్లను ప్రారంభిస్తున్న ఉదయశ్రీ

ఇష్టంతో చదవాలి : సెక్టోరియల్ అధికారి

తాంసి, ఫిబ్రవరి 7: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా సెక్టోరియల్ విద్యాశాఖ అధికారి ఉదయ శ్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలంటే ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. తాంసి కస్తూర్బా గాంధీ పాఠశాల పనితీరు పట్ల ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. అంతకుముందు పాఠశాలకు మంజూరైన కంప్యూటర్లను అధికారిణి ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గిరిజన విద్యార్థినుల నృత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, శ్రీలత, సౌమ్య, వెంకటమ్మ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అంతర్గత రహదారి నిర్మాణానికి భూమిపూజ

ఇచ్చోడ, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని రెడ్డికాలనీలో బుధవారం నూతనంగా రూ.18లక్షల ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరం కలిసికట్టుగా పనిచేసి బోథ్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఎనుగు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, నాయకులు లోక శిరీష్‌రెడ్డి, సునీత, లక్ష్మి, దేవానంద్, సుభాష్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని కొకస్‌మన్నూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన శబరిమాత ఆలయ 6వ వార్షికోత్సవాన్ని గ్రామస్థులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై ప్రత్యేక పూజలను నిర్వహించారు.

నేరడిగొండ: మండలకేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో బుధవారం నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ అలాగే మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకుంటు ఉన్నత స్థాయికి ఎదగాలి అన్నారు. పాఠశాలకు పలు క్రీడ సామాగ్రి కోసం 50వేలు ఆర్థిక సహాయం అందించారు.



ఇచ్చోడ రెడ్డికాలనీలో భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

పదవి లేక సుమన్‌కు పిచ్చి పట్టింది

● సీఎం రేవంత్‌రెడ్డి జోలికి వస్తే.. వేలిని నరికేస్తాం ● మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ● ఆదిలాబాద్ జిల్లాలో ఆందోళనలు



ఉండం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతున్న రేఖాశ్యామ్‌నాయక్



బోథ్‌లో సుమన్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తలమడుగు, ఫిబ్రవరి 7: ఎమ్మెల్యే పదవి కోల్పోవడంతో బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ పిచ్చిపట్టి మాట్లాడుతున్నారని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖా శ్యాంనాయక్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి జోలికి వస్తే వేలిని నరికేస్తామని హెచ్చరించారు. బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చెప్పు చూపడంపై.. మండలంలోని ఉండం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నుంచి తాము బానిస సంకెలు తెంపుకుని కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండు నెలల్లోనే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొంత మంది పిచ్చెక్కి మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలకు వణుకు పుడుతుందన్నారు. పదేళ్ల పాలనలో మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు తాగునీరు, రోడ్డు సౌకర్యంలేక ఇబ్బందులు పడ్డారన్నారు. గతంలో తాము మిషన్ భగీరథ అవినీతి అక్రమాలపై గతంలో మాట్లాడితే తమను బెదిరించారన్నారు. బాల్కసుమన్ అధికారం అడ్డం పెట్టుకుని అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. వాటన్నింటినీ వెలుగులోకి తెస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వైపు వేలు చూపిస్తే వేలు నరికేస్తానని.. ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో సంక్షేమ అభివృద్ధి పథకాలు జరుగుతున్నాయని రేఖా నాయక్ తెలిపారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మని దహనం చేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మీరాజేశ్వర్, ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● 'అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి'

బోథ్: చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే రాబోవు రోజుల్లో తగినశాస్తి జరగక తప్పదని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన కార్యదర్శి గుడాల అనిష్ పేర్కొన్నారు. బుధవారం సోనాల మండల కేంద్రంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇందులో మండల కన్వీనర్ గుడాల శేఖర్, సిర్సార్ మహేష్, నియోజక వర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రాథోడ్, బలిరాం, తదితరులున్నారు.

అలాగే, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన పరుష పదజాలాన్ని వెనక్కి తీసుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి డిమాండ్ చేశారు. బుధవారం బోథ్‌లో సుమన్ ఫ్లెక్సీని దహనం చేశారు.

ఘనంగా మాతా రమాబాయి అంబేద్కర్ జయంతి

ఉట్నూర్, ఫిబ్రవరి 7: మండలంలోని శ్యాంపూర్‌లో బుధవారం మాతా రమాబాయి అంబేడ్కర్ జయంతి వేడుకలను అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులు మాట్లాడుతూ రమాబాయి త్యాగానికి ప్రతిక అని అన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుధాకర్ బండి, ఉపాధ్యక్షుడు దాసం రాజేశ్వర్, దాసరి అరుణ్, ప్రధాన కార్యదర్శి తిగుట్ల రాజ్‌కుమార్, కార్యదర్శి సంజయ్ తుడిచెర్ల, దర్శన అంజన్న, రాములు దాకూరి రాములు, చిట్టిమల్ల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మిలింద్ నగర్ కాలనీలోని త్రిరత్న బుద్ధ విహార్‌లో మహామాయ ఉపాసిక సంఘ్ ఆధ్వర్యంలో రమాబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్ మాస్కే రాజవర్ధన్, ఆ సంఘ్ అధ్యక్షురాలు సోమోరే మాయాబాయి, ఉపాధ్యక్షురాలు గాయక్ వాడ్ శీలబాయి, వాగ్మారే ఉషబాయి, మాస్కే మాయాబాయి, కాంబ్లే ఉజ్వల, మాయావతి, మాధుమాల, ప్రభాబాయి, లతాబాయి, సోనాలి, గీతాబాయి, మీరాబాయి, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: డాక్టర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జన్మదిన వేడుకలు బుధవారం మండల కేంద్రంలోని జైభీం నగర్ బుద్ధ విహార్‌లో నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ మస్కె మాధవ్ మాట్లాడుతూ ఆమెను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇందులో అంబేడ్కర్ అసోసియేషన్ సభ్యులు ససానే మాధవ్, బుద్దే గోవింద్, బుద్దే కిషన్ కుషాల్, శంకర్, రమామాతా మహిళా మండల సభ్యులు పాల్గొన్నారు.



శ్యాంపూర్‌లో రమాబాయి జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



సీసీ పనులను ప్రారంభిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

ఉట్నూర్, ఫిబ్రవరి 7: మండలంలోని సాయిరాంనగర్, లక్కారం, సుద్దగూడ, కల్లూరుగూడ, ఘన్‌పూర్ గ్రామాలలో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ భూమిపూజ చేసి ప్రారంభించారు. బుధవారం మండలంలోని గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యేను ఆదివాసీ గిరిజనులు సాంప్రదాయ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల సమస్యలను ప్రజలు నేరుగా తనదృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్రం రాహుల్, లింగంపల్లి చంద్రయ్య, మహమ్మద్ ఇక్బాల్, హర్షద్, కార్యదర్శి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'గావ్ చలో'ను జయప్రదం చేయాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి7: బీజేపీ అధిష్ఠానం ఆదేశించిన విధంగా గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. గావ్ చలో ఘర్‌చలో అభియాన్ కార్యక్రమంలో బుధవారం పాల్గొన్న ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మనందల్లు మాట్లాడుతూ గాంవ్ చలో ఘర్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని తిరుమల పంక్షన్‌హాల్‌లో అభియాన్ కార్యక్రమం ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ గటిక క్రాంతికుమార్ సమక్షంలో ఉట్నూర్ మండల పార్టీ అధ్యక్షుడు కోలపాక రాజశేఖర్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ ఆదిలాబాద్ బీజేపీ జిల్ల అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్‌లు మాట్లాడారు. ఇందులో మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, అసెంబ్లీ కోకన్వీనర్ గడ్డం నందిరెడ్డి, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, జాతీయ నాయకులు గుగ్లోవత్ శ్రీరాంనాయక్, ఆదిలాబాద్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌బోయర్, గావ్‌చలో కోకన్వీనర్ మోహన్‌అగర్వాల్, రవీందర్వాల్గరే, నాయకులు లింగాగౌడ్, చిక్రం భీంరావ్, బీజేపీ సీనియర్ నాయకులు రాంచందర్, ఓబీసీ మోర్చ జిల్లా కార్యదర్శి దేవిదాస్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్ రైల్వేస్టేషన్‌లో చోరీ

● ఆదిలాబాద్ వ్యాపారి నుంచి రూ.35లక్షల విలువైన సొత్తు అపహరణ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని నాందేడ్ రైల్వేస్టేషన్‌లో బుధవారం తెల్లవారుజామున దొంగలు భారీ చోరీకి తెగబడ్డారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సురేష్‌కుమార్ అగర్వాల్ కూతురి వివాహం రెండు రోజుల క్రితం నాందేడ్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి సురేష్ అగర్వాల్ తన కుటుంబంతో రైలులో వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో బుధవారం తెల్లవారుజామున నాందేడ్ రైల్వేస్టేషన్‌లో దొంగలు రెండు బ్యాగులను దొంగలించారు. ఇందులో రెండు సెల్‌ఫోన్లు, రూ.30లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదు ఉంది. ఈ ఘటనపై బాధితుడు సురేష్ అగర్వాల్ బుధవారం సాయంత్రం నాందేడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గృహజ్యోతి విద్యుత్ హామీ అమలుకు శ్రీకారం

● జిల్లాలో పర్యటించిన టీఎస్ ఎన్‌పీడీసీఎల్ వరంగల్ చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఎన్.గుట్ట
● బైంసాలో విద్యుత్ సర్వీసు అనుసంధాన ప్రక్రియ పర్యవేక్షణ ● వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి

బైంసా, ఫిబ్రవరి 7 : అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పథకం అమలు కోసం గాను విద్యుత్‌శాఖ ప్రత్యేకంగా యాప్ రూపొందించింది. సంబంధిత యాప్‌లో విద్యుత్ వినియోగదారుల సర్వీసులకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సెల్‌నెంబరుల అనుసంధానం చేసేందుకు గాను వివరాలను నమోదు చేస్తున్నారు. టీఎస్ ఎన్‌పీడీసీఎల్ వరంగల్ చీఫ్ జనరల్ ఇంజనీర్, గృహజ్యోతి పథకం జిల్లా నోడల్ అధికారి కె.ఎన్.గుట్ట బుధవారం బైంసాలో పర్యటించి యాప్ ద్వారా వినియోగదారుల సర్వీసు నెంబరు వివరాలను అనుసంధానించే ప్రక్రియను ప్రారంభించారు. టీఎస్ ఎన్‌పీడీసీఎల్ జిల్లా ఎస్ఏవో సుదర్శన్, బైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ ఆదిత్య, ఏఈ మోహన్‌కుమార్, బైంసా మున్సిపల్ కౌన్సిలర్ చందులాల్‌లతో కలిసి చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఎన్.గుట్ట బైంసా పట్టణ 4వ వార్డు పరిధిలోని ఏపీనగర్ కాలనీలో యాప్ ద్వారా వినియోదారుల మీటర్‌నెంబర్, ఆధార్,రేషన్ కార్డుల నెంబర్లు, సెల్ నెంబరు వివరాల నమోదు చేసి అనుసంధానించే ప్రక్రియను ప్రారంభించారు. తద్వారా 200 లోపు యూనిట్ల విద్యుత్ యూనిట్ల విద్యుత్తును వాడే వినియోగదారుల సమాచారం మొత్తం నమోదవుతుంది. ప్రతి నెల ఇంటింటికి వెళ్లి మీటర్ రీడింగ్ నమోదు నిర్వహించే సిబ్బందికే సంబంధిత అనుసంధానించే వివరాల నమోదు చేసే బాధ్యతను అప్పచెప్పారు. సంబంధిత నమోదు ప్రక్రియను ఆయా ప్రాంతాల డీఈ,ఏడీఈ,ఏఈ, సబ్ ఇంజనీర్లు పర్యవేక్షించనున్నారు.

● అద్దె ఇంటికి కూడా

సొంత ఇల్లు లేకుండా కిరాయి ఇంటిలో నివసించే విద్యుత్ వినియోగదారులు కూడా గృహజ్యోతికి అర్హులే. వారు కూడా విధిగా ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్లను ఇంటి విద్యుత్ సర్వీసుకు అనుసంధానించుకోవాలి. దీని వల్ల ఇంటికి సంబంధించి యాజమాన్యం మారదు. గృహజ్యోతి పథకం కోసం కిరాయిదారులందరూ తాము అద్దెకున్న ఇంటి విద్యుత్ సర్వీసు నెంబరుకు తమ ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, సెల్‌ఫోన్ నెంబర్ల వివరాలను అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది.



వినియోగదారుల వివరాలను అప్‌లోడ్ చేస్తున్న టీఎస్ ఎన్‌పీడీసీఎల్ వరంగల్ చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఎన్ గుట్ట

● వినియోగదారులు సహకరించాలి

ట్రాన్స్‌కో సిబ్బంది యాప్‌లో వివరాల నమోదు కోసం ఇంటికి వచ్చినపుడు విద్యుత్ వినియోగదారులు ప్రతి ఒక్కరు రేషన్, ఆధార్‌కార్డులను అందుబాటులో ఉంచుకోవాలి. సిబ్బంది యాప్ ద్వారా మీటర్ రీడింగ్‌తో పాటు రేషన్,ఆధార్‌కార్డు నెంబర్లు, సెల్‌ఫోన్ నెంబరును నమోదు చేసుకుంటారు. ప్రతి నెల ట్రాన్స్‌కో సిబ్బంది మీటర్ రీడింగ్ నమోదు బిల్లు కోసం ఇంటింటికి వస్తారు. వాటితో పాటు వినియోగదారుల వివరాలను నమోదు చేసి సర్వీసు నెంబరుకు అనుసంధానిస్తారు. సెల్‌ఫోన్ నెంబరు నమోదు చేసిన పిదప ఎలాంటి సమాచారం అయినా అందేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నాం. సంబంధిత వివరాల నమోదు కోసం ఇంటికి వచ్చే సిబ్బందికి వినియోగదారులు సహకరించాలి

టీఎస్ ఎన్‌పీడీసీఎల్ వరంగల్ చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఎన్.గుట్ట

రమాబాయి అంబేద్కర్‌కు ఘన నివాళులు



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



మహిళా ఉద్యోగులకు సన్మానం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 7 : జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ 126వ జయంతి దళిత మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అంబేద్కర్ ఉన్నతికి ఆమె ఎంతో ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొని సహకరించిందన్నారు. ప్రపంచానికే ఆదర్శమూర్తి అని కొనియాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మె రాజు, నాయకులు రాజు, సాధం అరవింద్, నరేష్, అల్లం బాస్కర్, ఒడిసెల శ్రీనివాస్, అయ్యన్నగారి రాజేందర్, తోట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్ జయంతి సందర్భంగా బుధవారం నిర్మల్‌లోని ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మార్పీఎస్ నాయకులు ఘన నివాళులర్పించారు. రవి మాదిగ, రాజు, కే. శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎన్జీవో సంఘ భవనంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆమె చేసిన త్యాగాలను కొనియాడారు. పలు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. టీఎన్జీవో అధ్యక్షుడు వి. ప్రభాకర్, పోరాట సమితి అధ్యక్షుడు బొబ్బిలి ప్రసాద్, ఏ. రాజేశ్వర్, రంజిత్, భూమేష్, కె.వెంకటస్వామి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

తానూర్ : తానూర్ మండలంలోని ఝరి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మంగాయ్ సందీప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రమాబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ చైర్మన్ సందీప్‌రావు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యావాలంటరీని నియమించడం జరిగిందని, అదే విధంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఉత్తం బాలే రావు, నాయకులు దశరథ్, సినిమా డైరెక్టర్ కొత్తూర్ శంకర్, అనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయురాలు అలేఖ్య, తదితరులున్నారు.

వరి క్షేత్రాలను పరిశీలించిన అధికారి



యాసంగి వరి పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి

ముథోల్, ఫిబ్రవరి 7 : మండల కేంద్రంలోని యాసంగి వరి పంట పొలాలను బుధవారం ముథోల్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్ సందర్శించి పరిశీలించారు. వరిలో ఉధృతమవుతున్న కాండం తొలుచు పురుగు యాజమాన్యం గురించి రైతులకు సూచనలు ఇచ్చారు. పిలక దశలో ఉన్న వరి పైరులో కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు 20-25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలని సూచించారు.

ప్రత్యేక అధికారులతో గ్రామసభలు




గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం


ముథోల్, ఫిబ్రవరి 7 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు గ్రామ సభను నిర్వహించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో గ్రామంలోని సమస్యలను తెలుసుకోవడానికి ఈ గ్రామ సభ నిర్వహించినట్లు ప్రత్యేక అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో నిర్వహించాల్సిన పనులు, మరమ్మతులు, విద్యుత్, త్రాగునీరు, పారిశుధ్యం తదితర తీర్మానాల నివేదిక జాబితాను చదవి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరుల

యాజమాన్య పద్ధతులపై అవగాహన



తానూర్, ఫిబ్రవరి 7 : సహజ వనరుల యాజమాన్య పద్ధతుల గురించి బుధవారం తానూర్‌లో రైతులకు అవగాహన కల్పించారు. ప్రతినిధులు మాట్లాడుతూ జీవనోపాదుల గురించి, వ్యవసాయ అనుబంధ, వ్యవసాయేతర జీవనోపాదుల గురించి, సాగునీటి పొదుపు పద్ధతుల శిక్షణ చేస్తూ అవగాహన కల్పించారు. ఎంపిక చేసిన రైతులకు రేయిన్‌పైప్‌లను అందించడం జరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి యాజమాన్య అవశ్యకత చాలా ఉంది, అందుబాటులో ఉన్న నీటివనరులను సక్రమంగా ఉపయోగించుకోవాలని, ఎకో స్ప్రింక్లర్‌ల ప్రాముఖ్యతను వివరించారు. మాజీ సర్పంచ్ విఠల్, ఎంపీటీసీ మాధవ్‌రావుపటేల్ తదితరులున్నారు.



'సమ్మెను జయప్రదం చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 7: కార్మిక హక్కుల సాధణకు, చట్టాల పునరుద్ధరణ కోసం ఈనెల 16న సమ్మెను, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం ఈ విషయమై పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శైలజకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడారు. ఇందులో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దర్శనాల నగేష్, అగ్గిమల్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు.



● జిల్లాకేంద్రంలో బుధవారం మిట్టమధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారులు ఇలా..

ముదురుతున్న.. ఎండలు!

- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న భానుడి భగభగలు
- బుధవారం 36.0 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదు
- ఎండల తీవ్రతతో ప్రజలకు తప్పని తిప్పలు
- వేసవి నేస్తాలకు గిరాకీ!!
- పైపైకి కూరగాయల ధరలు
- వేసవి ప్రారంభంలోనే చెమటలు
- జిల్లావ్యాప్తంగా రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు చలితో వణికిపోయిన జనం.. ముదురుతున్న ఎండలు అప్పుడే చెమటలు పట్టిస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతాయి. గతేడు కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఈయేడు ఫిబ్రవరి ప్రారంభంలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం జిల్లా గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు 36.0 డిగ్రీలుగా నమోదు కాగా 18.5 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడు వేసవిలో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైన దాఖలాలూ ఉన్నాయి. వేసవి ప్రారంభంలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైతే.. రాబోయే మార్చి, ఏప్రిల్, మే మాసాలలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తి పోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు భానుడు భగభగలతో తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మధ్యాహ్న సమయంలో జనం ఇళ్లకే పరిమితం కావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ముఖ్యంగా గత నెల 28 నుంచి జిల్లా ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వేసవి పరిస్థితులకు అనుగుణంగా జనం ఏర్పాట్లను చేసుకుంటున్నారు. అంతేకాకుండా భానుడి భగభగలతో ఎండలు ముదురుతున్నాయంటూ పేర్కొంటున్నారు. ముదురుతున్న ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు.

పగలు ఎండ.. రాత్రి ఉక్కపోత

జిల్లాలో ముదురుతున్న ఎండలతో పగలంతా భానుడి భగభగలు.. రాత్రి వేళల్లో ఉక్కపోత కనిపిస్తోంది. ఎండల తీవ్రత పెరిగిపోవడంతో ఉపశమనం పొందేందుకు ప్రజలు వేసవి నేస్తాలను ఆశ్రయిస్తున్నారు. చిరువ్యాపారులు శీతల పానియాల కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే ముదురుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని కొత్త కూలర్లు, ఫ్రిజ్‌లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కూలర్ తయారీ, ఫ్రిజ్, ఏసీ షాపులకు భలే గిరాకీ పెరుగుతోంది. ఇళ్ల పైకప్పులు, ఇంటి ముందు చల్లని పందిళ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే రైతులు వేసవిలో తీసుకునే జాగ్రత్తలు, పండించే పంటలపై దృష్టి సారిస్తున్నారు. అదేవిధంగా అడవిలో ఆకు రాలడం ప్రారంభం కావడంతో.. అడవులన్నీ పలుచబడి పోతున్నాయి. మొత్తానికి పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు అనుకూలంగా ఏర్పాట్లను చేసుకునే పనిలో ప్రజలు నిమగ్నమవుతున్నారు.

పడిపోతున్న భూగర్భ జలాలు

ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు పడిపోతున్నాయి. బోరుబావుల్లో నీళ్లు అడుగంటుకు పోవడంతో వేసవి పంటల సాగు తగ్గుముఖం పడుతోంది. సరిపడా నీటితడులు అందక పూత, కాత రాలిపోయే అవకాశం ఉందని అన్నదాతలు వాపోతున్నారు. నిత్యం నీళ్లు ఇస్తేనే కొంతమేరకు దిగుబడులు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. రోజుకు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు కూరగాయల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోతున్నాయి. అయితే, గత వారం రోజులుగా మార్కెట్‌లో అన్ని కూరగాయల ధరలు పెరిగి పోతున్నాయి. ఇప్పటికే ఘాటెక్కిన వెల్లుల్లితో కొనేందుకు అవస్థలు పడుతున్నా జనానికి కూరగాయల ధరలు చమటలు పట్టిస్తున్నాయి. నిన్నమొన్నటి వరకు కిలో రూ.20 ధర పలికిన టమాటా ప్రస్తుతం రూ.40కి చేరుకుంది. ఇలా అన్ని కూరగాయలు, ఆకు కూరల ధరలు పెరిగి పోతున్నాయి. మండుతున్న ఎండలు కూరగాయల దిగు బడుల పై ప్రభావం చూపుతున్నాయి. కాగా, వేసవి ప్రారంభంలోనే కూరగాయల ధరలు ఇలా ఉంటే.. రాబోయే రోజుల్లో పరిస్థితులు ఎలా ఉంటాయోనని కొనుగోలు దారులు సైతం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



● ఎండతాపానికి దాహం తీర్చుకుంటున్న ఓ వ్యక్తి

మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి

: వెంకట్‌రెడ్డి, రైతు, తలమడుగు మండలం



గత వారం రోజులుగా ఎండలు ముదరడంతో ఉదయం, సాయంత్రం వేళలో నే వ్యవసాయ పనులను చేపడుతున్నాం. మధ్యాహ్నం సమయంలో విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుంది. మధ్యాహ్నం 12 నుంచి 3గంటల వరకు విపరీతమైన ఎండ కనిపిస్తోంది. పంటలకు నీటి తడులు రోజు తప్పి రోజు అందించాల్సి వస్తుంది. ఉపాధి కూలీలు కూడా ఉదయం 11 గంటల లోపే పనులు పూర్తి చేసుకుని ఇంటికి తిరుగుముఖం పడుతున్నాం. ఈసారి ఫిబ్రవరి మాసంలోనే ఎండల తీవ్రత మరీ ఎక్కువగా కనిపిస్తోంది.

ఫిబ్రవరి 1 నుంచి జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలిలా..

రోజు	గరిష్ఠం	కనిష్ఠం
ఫిబ్రవరి 1	33.3	19.2
ఫిబ్రవరి 2	33.8	19.2
ఫిబ్రవరి 3	31.3	16.8
ఫిబ్రవరి 4	32.3	14.7
ఫిబ్రవరి 5	33.3	18.7
ఫిబ్రవరి 6	35.3	21.5
ఫిబ్రవరి 7	36.0	18.5

సంక్షిప్త సమాచారం



పశువులను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

పశువుల లారీ పట్టివేత

నేరడిగొండ, ఫిబ్రవరి 7: ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు ఒక లారీలో అక్రమంగా పశువులను తరలిస్తున్నారని పక్క సమాచార మేరకు బుధవారం స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా ఎస్సై పోలీసు సిబ్బందితో కుప్టిఘాట్ వద్ద వెళ్లి వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఒక లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపి దిగి పారిపోయాడు. దీంతో పోలీసులు ఆ లారీలో చూడగా అందులో పదుల సంఖ్యలో పశువులు కాళ్లను తాళ్లతో కట్టివేసి ఉన్నవని, వెంటనే వాటిని గోశాలలో అప్పగించామని ఎస్సై పేర్కొనారు. ఈ మేరకు లారీని పీఎస్‌కి తరలించామని, కేసు నమోదు చేయడం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.

ఆసుపత్రి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : ఏఐటీయూసీ

ఉట్నూర్, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సమితి సభ్యురాలు రాథోడ్ కౌసల్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉట్నూర్ జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ పేషేంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్స్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ పాల్గొని మాట్లాడుతూ ఉట్నూర్ జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ పేషేంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులను సంబంధిత జీపీ కాంట్రాక్టర్ జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వకుండా వేతనంలో నుంచి పీఎఫ్‌ఈఎస్‌ఐల నుంచి కోతలు చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ జోక్యం చేసుకుని కార్మికులకు మోసం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సంగీత, కమలబాయి, సరిత, బాబ్లు, సతీష్, వంశీ, రాధా, శోభ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభమైన ఉచిత విద్యుత్ హామీ సర్వే

బోథ్, ఫిబ్రవరి 7: మండలంలో ఉచిత విద్యుత్ హామీ సర్వే మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వే ప్రారంభించారు. సర్వేలో వినియోగిస్తున్న విద్యుత్ వివరాలను సేకరిస్తూ ఇంటి యజమానికి సంబంధించిన రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను సేకరిస్తున్నారు. దీంతో ఉచిత విద్యుత్ వినియోగదారునికి అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. ఇంటి యజమాని రేషన్ కార్డు ఉంటేనే ఈ పథకం వర్తిస్తుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అడవి తల్లి ఒడిలో ఆదివాసీ పండుగ

● నాగోబా మహా జాతరకు ఏర్పాట్లు పూర్తి ● సర్వాంగ సుందరంగా శేష నాగు ఆలయం ● మర్రి చెట్టు వద్ద మెస్రం తూమ్ పూజలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 7: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే నాగోబా జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఈ నెల 9 నుంచి 15 వరకు జరిగే ఈ జాతరలో తమ ఆరాధ్య దైవమైన నాగోబాను ఘనంగా పూజించేందుకు ఆదివాసీలుఉ సిద్ధమయ్యారు. ఇందుకోసం కేస్లాపూర్‌లోని నాగోబా (శేష నాగు) ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌ల నుంచి వచ్చే వివిధ తెగల ఆదివాసీలు ఎంతో భక్తి శ్రద్ధలతో పాల్గొనే ఈ జాతరతో కేస్లాపూర్ అటవీ ప్రాంతం జనసంద్రం అవుతుంది. పగలు, రాత్రి ప్రత్యేక పూజలతో మార్మోగుతుంది. ఎక్కడెక్కడో నుంచి వచ్చే ఆదివాసీలంతా ఒక చోటికి చేరిన సందర్భంగా మంచి చెడ్డ మాట్లాడుకుంటారు.

● మెస్రం వంశీయుల తూమ్ పూజలు

ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా జాతర ఈనెల 9న పుష్యమాసం అమావాస్య రోజున అర్ధరాత్రి మెస్రం వంశీయుల మహాపూజతో జాతర ప్రారంభమవుతుంది. కాగా ఈ వేడుకకు మెస్రం వంశీయులతో పాటు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మెస్రం వంశీయులు కేస్లాపూర్‌లోని మర్రిచెట్టు వద్ద బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడ్లబండ్లతో పాటు ఇతర వాహనాలతో మెస్రం వంశీయులు తరలివచ్చి మర్రిచెట్టు వద్ద బస చేశారు. మంగళవారం రాత్రి ఆయా గ్రామాల నుంచి మెస్రం వంశఋయులు పటేళ్లకు కాకడ హారతి పట్టి స్వాగతం పలికారు. బుధవారం రాత్రి వారి ఆచారం ప్రకారం మెస్రం వంశంలో మృతి చెందిన వారి పేరట తూమ్ పూజలు నిర్వహించారు. ఈ పూజలతో చనిపోయిన వారు నాగోబా సన్నిదికి చేరుతారనేది వారి నమ్మకం. మహాపూజలకు అవసరమగు పవిత్ర గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు మర్రి చెట్టు వద్ద 22 కితల వారీగా గుడారాలు ఏర్పాటు చేసి బస చేశారు. కితల వారీగా వంటలు నైవేద్యాలు తయారు చేసి పూజ సామాగ్రి వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. సిరికొండ మండలంలోని కుమ్మరులతో తయారు చేయించిన కుండలను బుధవారం నాగోబా ఆలయానికి తీసుకొచ్చారు.



● మర్రిచెట్టు వద్ద 22 కితల వారీగా గుడారాలు ఏర్పాటు చేసి బస చేస్తున్న మెస్రం వంశీయులు



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న నాగోబా(శేషనాగు) ఆలయం



గుడారాలో సేదతీరుతున్న మెస్రం వంశీయులు



నైవేద్యాలు తయారు చేస్తున్న మెస్రం వంశీయుల మహిళలు



ఆదివాసీ దేవత కోసం నైవేద్యాలు తయారు చేసిన దృశ్యం

సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

● బ్యాంకర్లతో సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 7: అర్హులందరికీ సకాలంలో రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన డిసెంబరు 2023 మాసాంతపు జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు పంట అనుబంధ రుణాలు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్యా, గృహ రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రుణాలను అర్హులైన పేద ప్రజలకు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సూచించారు. అలాగే పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద అర్హులైన లబ్దిదారులకు యూనిట్లను మంజూరు చేయాలన్నారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలు రూపొందించి నిర్ణీత గడువు లోగా రుణాలు మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల రుణ పరిమితిని పెంచాలని, ఇచ్చిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే విధంగా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులు వార్షిక సంవత్సరం ముగిసే లోగా వారి లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. రైతులకు పంట అనుబంధ రుణాలతో పాటు డెయిరీ, పౌల్ట్రీ, తదితర యూనిట్లను మంజూరు చేయడం ద్వారా రైతులకు రెండు రకాల ఆర్థిక ప్రగతి పెరుగుతుందన్నారు. బ్యాంకుల వారీగా లక్ష్యాలు, సాధించిన ప్రగతి పై చర్చించారు. అనంతరం 2024-25 ఆర్థికస ంవత్సరానికి సంబంధించిన పోటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వంద శాతం ఆర్థిక ప్రగతి సాధించినందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం వెంకట్రామ్‌రెడ్డిని ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం ప్రసాద్, నాబార్డ్ డీఎం ఎండీ రవుఫ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పద్మభూషణ్‌రాజు, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్)

'త్రిఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి 7: మండలంలోని బీరుసాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కోలాంగూడ గ్రామానికి త్రిఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆదివాసులు బుధవారం బీర్సాయిపేటఫారెస్టు రేంజ్ కార్యాలయం ముందు ఆందోళనకు పూనుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపటేల్ ఆత్రం తుకారాం మాట్లాడుతూ గిరి వికాసం పథకం కింద 8బోరుబావులు మంజూరైనందున త్రిఫేస్ కరెంట్ సౌకర్యం లేక వినియోగించుకోలేక పోతున్నామన్నారు. అటవీ శాఖ అడ్డంకుల వల్ల కరెంట్ సౌకర్యం కలుగడం లేదని అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు తమ సమస్యను పరిష్కరించడం లేదని, అందుకోసం మీ ఆందోళన చేయాల్సి వచ్చిందని అన్నారు.తమ గ్రామం టైగర్‌జోన్‌లోని కోర్ ఏరియాలో ఉందంటూ ఇబ్బందులు పెట్టడం సరైనది కాదని, వారు అన్నారు.కోర్ ఏరియాలో ఉండడం వల్ల తాము అనుమతి ఇవ్వలేమని ఎఫ్ఆర్‌వో గులాం మోయనుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముకుందరావు, భీంరావు, సోనిరావు, లక్ష్మణ్, అయ్యుబాయి, బాపురావు, వినాయకరావు, చిన్ను, తదితరులు లు పాల్గొన్నారు.



బీర్సాయిపేట ఎఫ్ఆర్‌వో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఆదివాసీలు